

విత్తనశుద్ధి.. దిగుబడి వృద్ధి

రబీ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేయడానికి ముందుగా విత్తనకాయల పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది.

- 8లో

తండ్రి చేతిలో గాయపడిన బాలుడి మృతి



ప్రొద్దుటూరు మండలం నక్కలదిన్నె గ్రామంలో మతిస్థిమితం కోల్పోయిన తండ్రి నరసింహారెడ్డి గొడ్డలితో నరకడంతో.. తీవ్రంగా గాయపడిన అభితేజరెడ్డి (15) సోమవారం రాత్రి మృతి చెందాడు.

- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.300
రెండోరకం	రూ.150	రూ.218

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 130 మెట్రిక్ టన్నులు



బ్రహ్మోత్సవ వైభవం

- 21 నుంచి కడప రాయుని బ్రహ్మోత్సవాలు
- కరోనా కారణంగా మూడేళ్లుగా నిబంధనల నడుమ బ్రహ్మోత్సవాలు
- ఈసారి వైభవంగా ఉత్సవాల నిర్వహణ
- చురుగ్గా కొనసాగుతున్న ఏర్పాట్లు
- ఆలయ ఆవరణలో ఉట్టిపడుతున్న ఉత్సవ శోభ
- సీమేతర జిల్లాల నుంచి సైతం పెద్ద ఎత్తున రానున్న భక్తులు



దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం

కడప కల్చరల్ : తిరుమల తొలిగడపగా భావించే దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికోసం నాలుగు రోజులుగా అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయ గోపురం ఎదుట ఉత్సవాల వివరాలను క్లుప్తంగా తెలుపుతూ ఫ్లెక్సీ ఆర్చిని ఏర్పాటు చేశారు. ఆలయ గోపురానికి రంగులు వేస్తున్నారు. ఆలయం లోపల కూడా పలుచోట్ల రంగులతో ముగ్గులు వేస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో, వెలుపల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో, ఆలయ గోపురం, ప్రహరీలకు ఇప్పటికే సీరియల్ లైట్‌సెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో అడుగు పెట్టగానే బ్రహ్మోత్సవాల శోభ కనిపించేలా ఆ ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. రోజువారి సేవల కోసం ఉన్న వాహనాలను మరమ్మతులు చేసి రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. నగరం నలుమూలలా బ్రహ్మోత్సవాల వివరాలతో భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. రథోత్సవం కోసం రథానికి మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయంగా సిద్ధం చేస్తున్నారు.

నూతనోత్సాహంతో..

జిల్లాలో దేవునికడప బ్రహ్మోత్సవాలకు గొప్ప పేరుంది. వారం రోజులపాటు వాహన సేవలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. రథోత్సవం నాడు భారీగా తిరుణాల జరుగుతుంది. రాయలసీమ నలుమూలల నుంచి భక్తులు భారీగా హాజరవుతారు. కరోనా కారణంగా మూడేళ్లుగా బ్రహ్మోత్సవాలను నిర్వహించకపోవడంతో ఈ సంవత్సరం నిర్వాహకులు రెట్టించిన ఉత్సాహంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం నెలరోజుల క్రితమే ఆలయాన్ని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి అర్చకులు, స్థానిక అధికారులతో చర్చించారు. మాడవీధుల్లో సిమెంటురోడ్డు వేయడంతో రథం తిరగడానికి అనువుగా ఉందని భక్తులు పేర్కొంటున్నారు. అన్నిచోట్ల స్పీడ్ బ్రేకర్లు ఉండటం, మరోచోట పాఠశాల వద్ద సిమెంటురోడ్డు పల్లంగా ఉండడంతో రథం తిరిగేందుకు ఇబ్బందులు ఏర్పడతాయని మరికొందరు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంపై మూడేళ్ల తర్వాత బ్రహ్మోత్సవాలు తిరిగి వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.



వాహనాలు, వాహనశాలకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు



ఆలయ ఆవరణలో ఫ్లోరింగ్‌కు రంగులు వేస్తున్న కార్మికులు



ఆలయంలో కొనసాగుతున్న పనులు

ఇన్‌చార్జిల సంగతి అంతేనా?

- టీడీపీని నమ్ముకున్నవారికి చంద్రబాబు మొండిచేయి!
- ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప సీట్లపై దోబూచులాట
- ఇన్‌చార్జిలను అభ్యర్థులుగా ఖరారు చేయని వైనం
- అన్ని హంగులు ఉన్నోళ్లు వస్తే.. బోయీలుగా మిగిలిపోవాల్సిందే



అమీర్‌బాబు



పుత్తా నరసింహారెడ్డి



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



పుట్టా సుధాకర్ యాదవ్

సాక్షి ప్రతినిధి, కడప: వయసైపోయిన ఒక ముసలి పులి నీళ్ల మడుగులో నుంచి ఒక బాటసారిని పిలుస్తుంది. 'నన్ను ఈ నీళ్ల నుంచి బయటికి లాగితే నా చేతికి ఉన్న బంగారు కంకణం ఇస్తానని ఆశ పెడుతుంది. బాటసారి బంగారం మీద ఆశతో దిగుతాడు. పులి అతన్ని తిని బ్రేవ్‌మంటుంది'. ప్రస్తుత రాజకీయాల్లో పులి టీడీపీ అధినేత చంద్రబాబు కాగా, బాటసారిగా ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు కన్పిస్తున్నారు. నియోజకవర్గం బాధ్యులుగా వారు పార్టీ కార్యక్రమాలను చురుగ్గా చేపట్టినా, వారిని అభ్యర్థిగా బాహాటంగా ప్రకటించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని హంగులు ఉన్నోళ్లు వస్తే మొండిచేయి చూపేందుకు చంద్రబాబు సిద్ధంగా ఉన్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అవకాశవాదానికి నిలువుటద్దంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని రాజకీయ విశ్లేషకులు వర్ణిస్తుంటారు. గత చరిత్ర అందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎన్టీ రామారావును గద్దె దింపేందుకు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బామ్మర్ది హరికృష్ణలతో దోస్తీ చేసి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వారిని వదిలేసిన వైనాన్ని ఇప్పటికీ గుర్తు చేస్తుంటారు. అనుభవాన్ని ఆసరాగా చేసుకొని ఎవర్ని ఎంతవరకు వాడుకోవాలో అంతవరకే వాడుకుని కూరలో కరివేపాకులా తీసి పడేసే వ్యక్తిత్వం చంద్రబాబుకు ఉండటమే అందుకు కారణంగా పలువురు పేర్కొంటున్నారు. జిల్లాలో సైతం అలాంటి పరిస్థితి కన్పిస్తోంది.

బోయీలుగా ఆ నలుగురు

పల్లకి మోసే బోయీలుగా ఆ నలుగురు మిగిలిపోవాల్సిందేనా అంటే విశ్లేషకులు అవుననే సమాధానం ఇస్తున్నారు. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరులకు టీడీపీ ఇన్‌చార్జిలుగా అమీర్‌బాబు, పుత్తా నరసింహారెడ్డి, గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్‌లు వ్యవహరిస్తున్నారు. ఆయా స్థానాల్లో టీడీపీ అభ్యర్థులుగా వారిని ఇప్పటికీ ఖరారు చేయడం లేదు. ఇందుకు కారణం అంతకంటే మెరుగైన అభ్యర్థి దొరుకుతాడేమోనని టీడీపీ అధినేత అన్వేషిస్తుండటమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మైదు కూరు, కమలాపురం, ప్రొద్దుటూరులలో ప్రత్యామ్నాయంగా మాజీ ఎమ్మెల్యేల వైపు చంద్రబాబు దృష్టి మళ్లిస్తున్నట్లు సమాచారం. జమ్మలమడుగులో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

ఎవరైనా అదే గతే..

ఇంతకు ముందే చెప్పుకున్నట్లు ముసలిపులి–బాటసారి కథే టీడీపీ ఆశావహులకు వర్తించనుంది. అందుకు ఉదాహరణగా జిల్లాలో కందుల కుటుంబాన్ని చెప్పుకోవాలి. అప్పట్లో కందుల రాజమోహన్‌రెడ్డిని టీడీపీ అభ్యర్థిగా వైఎస్ కుటుంబంపై మూడుసార్లు పోటీ చేయించారు. ఆర్థికంగా, రాజకీయంగా నష్టపోయిన రాజమోహన్‌రెడ్డికి తర్వాత కాలంలో మొండి చేయి చూపించారు. అలాగే పారిశ్రామికవేత్త పాళెం శ్రీకాంత్‌రెడ్డిని 2009లో ఓమా రు టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. తర్వాత కాలంలో ఆయన కూడా కరివేపాకయ్యారు. తాజాగా రాబోవు ఎన్నికల్లో అలాంటి కరివేపాకుల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు చూస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

న్యూస్‌రీల్

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు రూ.539.13 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న కారపాకుల భాస్కర్ నాయుడు

పీలేరు రూరల్: జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు రూ. 539.13 కోట్లు మంజూరైనట్లు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్ నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 73,454 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. పునాదులు 24,141 ఇళ్లకు పూర్తి అయ్యాయని, 7,119 గోడల నిర్మాణాలు జరిగాయని తెలిపారు. 11,724 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయినట్లు చెప్పారు. ఉగాది లోపు 22,240 ఇళ్లు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా బిల్లుల రూపంలో రూ. 473.04 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే మెటీరియల్స్‌కు రూ. 66.08 కోట్లు ఇచ్చామన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాలాజీ నాయక్, మాజీ జెడ్పీటీసీ జయరామచంద్రయ్య పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్జేడీ



ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

వైవీయూ : పాఠశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి మంగళవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి, వేదమంత్రోచ్చారణల మధ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్జేడీని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బడి నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక తదితర పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడటంతో పాటు రానున్న పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డీఈఓ రాఘవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల శుభాకాంక్షలు..

ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిని వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి ముఖ్యమంత్రి విశేష కృషి



రాజంపేటలో శ్రీ కృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం

- శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో ఎంపీ మిథున్‌రెడ్డి

రాజంపేట: రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజంపేట లోక్‌సభ సభ్యుడు, ప్యానల్ స్పీకర్ పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాజంపేట పాతబస్టాండు సర్కిల్‌లో పురపాలకసంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్‌చైర్మన్, నియోజకవర్గ కాపునేత మర్రి రవికుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్యలతో కలిసి ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ అంటేనే శ్రీకృష్ణదేవరాయలు గుర్తుకొస్తారన్నారు. రాయల పాలనలో ఏ విధంగా అన్ని వర్గాలకు మేలు జరిగిందో అదే రీతిలో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పాలన సాగిస్తున్నారన్నారు. రాజంపేటలో కాపుల ఆరాధ్య దైవంగా భావించే శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో కాపునేత మర్రి రవి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కాపులకు రాజకీయ, ఆర్థిక ప్రాధాన్యత కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. క్యాబినెట్‌లో కాపులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వారిపట్ల తనకున్న అభిమానం, గౌరవాన్ని చాటుకున్నారన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఏ ఒక్కరూ కూడా రాయల విగ్రహాన్ని పెట్టలేకపోయారని, అది ఒక్క వైఎస్సార్‌సీపీ పాలనలో కాపునేత రవి ఆధ్వర్యంలో ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. కాపునేత, మున్సిపల్ వైస్‌చైర్మన్ మర్రి రవికుమార్ మాట్లాడుతూ కాపులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాముడు అయితే, లక్ష్మణుడు ఎంపీ మిథున్‌రెడ్డి అని కొనియాడారు. విగ్రహావిష్కరణలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, టీటీడీ బోర్డు డైరెక్టర్ అశోక్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఆర్వో ఈశ్వరయ్య, కాపు మహిళా నేత మిరియాల సురేఖ, కాపు నాయకులు తోట లక్ష్మీనారాయణ, ఎంఎల్ నారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు రైల్వే రన్నింగ్ స్టాఫ్ క్రూ సెంటర్ తరలించొద్దు

రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ తరలించే ప్రతిపాదన విరమించుకోవాలని దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ ఏకే జైన్‌ను ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం మేడాభవన్‌లో ఎంపీని ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్ కలిసి నందలూరు రైల్వే దుస్థితి, జరుగుతున్న తిరోగమన పరిస్థితులను వినతిపత్రం ద్వారా విన్నవించారు. దీంతో స్పందించిన ఎంపీ జీఎంతో ఫోన్ ద్వారా మాట్లాడారు. నందలూరుకు రైల్వేపరంగా ఘనమైన చరిత్ర ఉందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్‌ను తరలించాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్‌సభ్యుడు కలీం, బీసీ నేత హిమగిరి, తుమ్మల శ్రీధర్‌గౌడ్, మైనార్టీ నేత మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే మాడ్యూల్స్ త్వరితగతిన పూర్తి చేయండి

- ఓటరు జాబితాలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో జరుగుతున్న రీసర్వేలో మ్యుటేషన్స్, ఖాతా కరెక్షన్స్, ఈకేవైసీ, ఫీల్డ్ పీఓఎల్ఆర్ తదితర మాడ్యూల్స్‌ను గడువులోపు వంద శాతం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి రీసర్వే, ఫీల్డ్ పీఓఎల్ఆర్, అసైన్‌మెంట్ ల్యాండ్, శ్మశానవాటికలు, బీఎస్ఎన్ఎల్‌కు స్థల కేటాయింపు, ఇళ్లపట్టాల మంజూరు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా పెండింగ్ సమస్యల పరిష్కారం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, క్లెయిమ్స్ పరిష్కారం తదితర అంశాలలో ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 26 గ్రామాల్లో మ్యుటేషన్స్, ఖాతా కరెక్షన్స్, క్లరికల్, డిజిటల్, సిగ్నేచర్ తదితర నాలుగు రకాల మాడ్యూల్స్ పూర్తి చేశామన్నారు. అలాగే 71 శాతం ఈకేవైసీ పూర్తి చేశారని వంద శాతం పూర్తి చేసేలా ఆర్డీఓలు దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలోని 465 గ్రామాల్లో 81 గ్రామాల్లో మాత్రమే ఫీల్డ్ పీఓఎల్ఆర్ ప్రక్రియను ప్రారంభించారని మిగిలిన అన్ని గ్రామాల్లో వెంటనే ప్రారంభించాలన్నారు. ఆయా డివిజన్‌లలో ఎంతెంత అసైన్‌మెంట్ ల్యాండ్ ఉందన్న వివరాలను వెంటనే జిల్లా సచివాలయానికి పంపించాలని రాజంపేట సబ్‌కలెక్టర్, రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలను ఆదేశించారు. ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా పెండింగ్ సమస్యలను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో పెండింగ్‌లో ఉన్న 13,600 సమస్యలను పరిశీలించి 10 రోజుల్లో పూర్తిగా పరిష్కరించాలని చెప్పారు. ఉద్యోగుల హాజరు నమోదుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎఫ్ఆర్ఎస్– యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకుని ఎన్‌రోల్ అయి ప్రతిరోజూ హాజరు వేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు, గదులకు దరఖాస్తు చేసుకోండి

రాయచోటి అర్బన్: రాయచోటి డిపో పరిధిలో ఆర్టీసీకి సంబంధించిన గదులు, ఖాళీస్థలాలు బాడుగకు తీసుకునేందుకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ ధనుంజయ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని గాలివీడు, చిన్నమండెం, రాయచోటి బస్టాండులలోని పక్కా గదులతో పాటు ఖాళీ స్థలాలను బాడుగకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాయచోటి బస్టాండులో 4, చిన్నమండెంలో 6, గాలివీడులో 6 చొప్పున గదులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల వారు డిపోకార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని పూర్తిచేసి ఈనెల 19వ తేదీలోపు డీఎం కార్యాలయంలో అందజేయాలన్నారు.

కడపలో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్

- రిజిస్ట్రేషన్లు ఇక ఆన్‌లైన్‌లో
- పాస్‌పోర్టు సేవా కేంద్రాల తరహాలో అత్యాధునిక రిజిస్ట్రేషన్ల సెంటర్ల ఏర్పాటుకు చర్యలు
- అవినీతి డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులకు స్వస్తి
- స్లాట్ విధానం, సింగిల్‌విండో రిజిస్ట్రేషన్



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆస్తుల క్రయ విక్రయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఒక పెద్ద ప్రహసనం. దీనికి తోడు అడుగడుగునా అవినీతితో పాటు డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువగా ఉండేది. అయితే ప్రభుత్వం వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు ప్రజలకు సులభంగా అత్యాధునిక పద్ధతిలో రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీసు సెంటర్లను అందుబాటులోకి తీసుకు రానుంది. వినియోగదారులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా పాస్‌పోర్టు సేవా కేంద్రాల తరహాలో కార్పొరేట్ స్థాయి హంగులతో సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

తొమ్మిది పీఆర్‌సీల ఏర్పాటుకు నిర్ణయం

రాష్ట్రంలో తొమ్మిది ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్ల(పీఆర్‌సీ)ను ఏర్పాటు చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించింది. వీటిని విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయవాడ, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అక్కడ సేవలు విజయవంతం కావడంతో మిగిలిన విజయవాడ, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అధికారులు కడప నగరంలో ప్రజలకు అనువైన ప్రాంతంలో ఐదు నుంచి ఏడు వేల చదరపు అడుగుల భవనం కోసం అన్వేషిస్తున్నారు. అన్నీ అనుకూలించినట్లయితే త్వరలోనే ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఇక ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు: ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్ ఫ్రంట్ ఎండ్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉంటారు. బ్యాక్ ఎండ్‌లో సబ్ రిజిస్ట్రార్, ఇతర సిబ్బంది ఉండి పనులు చేస్తారు. మొదట కొద్దిరోజులు ఆన్‌లైన్‌లో సేవలు అందించినా ఆ తర్వాత అన్నీ ఆఫ్‌లైన్ సేవలే ప్రజలకు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేస్తున్నారు. అంతే కాకుండా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారం సెంటర్‌కు వెళ్లి సింగిల్ విండో కింద రిక్వెస్ట్ పెడితే ఆన్‌లైన్‌లో సంబంధిత సేవా ప్రక్రియ మొదలవుతుంది. వినియోగదారులే తమ సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చు. అప్పుడే ఆన్‌లైన్‌లోనే సబ్ రిజిస్ట్రార్‌కు వెళుతుంది. ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి ఆధార్‌ను వెరిఫికేషన్‌ను చేస్తారు. అనంతరం ఆస్తుల వివరాలను పరిశీలించి సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. ఇక డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం ఏమాత్రం ఉండదు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే చేయించుకున్న వారికి పూర్తయినట్లు మెసెజ్ వెళుతుంది. రిజిస్ట్రేషన్లు మార్కెట్ విలువ, మదింపు, ఈసీలు, పీసీలు, స్టాంప్‌ల అమ్మకాలన్నీ కూడా ఇక్కడే జరగనున్నాయి.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్ సేవలు



పారదర్శక రిజిస్ట్రేషన్ సేవలు అందించడమే ప్రీమియం సెంటర్ల ముఖ్య ఉద్దేశ్యం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సులభంగా సేవలు అందుతాయి. మధ్యవర్తుల ప్రమేయం ఏమాత్రం ఉండదు. అవినీతికి తావుండదు. – శివరాం, డీఐజీ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, కడప

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

బి.కొత్తకోట : మండలంలోని నాయనబావి పంచాయతీ పత్రవారిపల్లె వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామమోహన్ మంగళవారం తెలిపారు. వీరి నుంచి రూ.4,100 స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. మంగళవారం పుంగనూరు మండలం మాలేనత్తంకు చెందిన రమేష్(36) కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లె పట్టణం బుగ్గకాలువకు చెందిన పి.జగదీష్(39) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఇంటిలో ఉన్న క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పత్రపల్లెకు చెందిన డి.సుధాకర్(38) కుటుంబ సమస్యల కారణంగా క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితులను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీలోని 5వ వీధికి చెందిన కటిక చంద్రనీల(20) అనే యువతి కనిపించకపోవడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. చంద్రనీల ఇంటర్మీడియెట్ వరకు చదివి రెండేళ్లుగా రేణిగుంట సమీపంలోని శ్రీసిటీలో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోగా.. బంధువులు, స్నేహితులు, పని చేస్తున్న చోట వెతికినా కనిపించలేదని తండ్రి మనోహర్ ఫిర్యాదు చేశాడని ఎస్ఐ చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని, ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక మంగళవారం తెలిపారు. మండలంలోని చౌడసముద్రంకు చెందిన జి.నాగమ్మ(40) తన ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితురాలి నుంచి 87 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

సారా విక్రేత అరెస్ట్

కేవీపల్లె : పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు పీలేరు సెబ్ సీఐ వై.గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని బురుజుకాడపల్లెలో సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో మంగళవారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఫసురుల్లా పది లీటర్ల సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది రాఘవయ్య, యోగానంద్, సుధాకర్, సురేష్, లోకేష్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధి.. దిగుబడి వృద్ధి

- రైతు చూపు.. వేరుశనగ వైపు
- 70 శాతం మంది సాగు
- మూడు వేలకు పైగా హెక్టార్లలో పంట
- భూసార పరీక్షలు చేయించుకోవాలంటున్న అధికారులు



భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

గుర్రంకొండ : జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో రైతులు సాగు చేసే ముఖ్యమైన పంట వేరుశనగ. ఖరీఫ్‌తోపాటు రబీ సీజన్‌లోనూ 70 శాతం మంది సాగు చేస్తారు. మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగుకు ముందే పొలాల్లో భూసార, విత్తనకాయల పరీక్షలు చేయించాలని వారు చెబుతున్నారు. సాగు సమయంలో విత్తనశుద్ధితో మొక్కలకు సంరక్షణ ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆర్బీకేల్లో ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలను రైతులకు పంపిణీ చేసింది. దీంతో సాగుకు సమాయత్తమవుతున్నారు.

విత్తనకాయల పరీక్ష తప్పనిసరి

రబీ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేయడానికి ముందుగా విత్తనకాయల పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో రైతులు కొనుగోలు చేసిన విత్తనకాయల్లో మొలకెత్తే శాతం తెలిసిపోతుంది. ఒక ట్రేలో మట్టి, ఇసుక, ఎరువులతో నింపి 100 విత్తన గింజల్ని నాటాల్సి ఉంటుంది. 12 రోజుల అనంతరం మొలకెత్తే శాతం బట్టి నాణ్యత పరీక్ష తెలుస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 70 నుంచి 85 శాతం వరకు మొలకెత్తితేనే నాణ్యమైన విత్తనాలుగా నిర్ధారించవచ్చు. కాబట్టి ప్రతి రైతు తాము కొనుగోలు చేసిన విత్తనాలను ముందుగా ఇలా విత్తన కాయల పరీక్ష చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పంట సాగు చేసిన ప్రతిసారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షలో వీటి శాతం ఎంత మేరకు తగ్గిందో తెలుసుకోవచ్చని చెబుతున్నారు. అందువల్ల తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని పేర్కొంటున్నారు.

సూచనలు

- వేరుశగ పంట సాగు చేసే పొలాల్లో సూక్ష్మ పోషకాల సమతుల్యత సరి చేసుకోవాల్సి ఉంటుంది. దుక్కులు చేసే, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాల మందులను వినియోగించాలి.
- పంట సాగులో బోరాన్, సల్ఫర్‌ను వినియోగించాలి. తద్వారా వేరుశనగ కాయలు నాణ్యతగా వస్తాయి. వాటి బరువు కూడా పెరుగుతుంది.
- జింక్ వినియోగించడం వల్ల మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, ధృడంగా ఉంటాయి. కాయల్లో గింజ ఏర్పడే శాతం కుడా పెరుగుతుంది.
- వేరుశనగ పొలాల్లో జిప్సం చల్లడం వల్ల గింజల్లో నూనె శాతం ఎక్కువగా ఏర్పడుతుంది. దుక్కులు చేసే సమయంలో ఎకరానికి 200 కేజీల జిప్సం చల్లాలి.
- సాగు సమయంలో విత్తనశుద్ధి చేసుకోవాలి. డీఎమ్ 45 అనే రకం విత్తనశుద్ధి మందును ఎకరానికి సరిపడే విత్తన గింజల్లో 180 గ్రాములు కలపాల్సి ఉంటుంది. ఈ మందును విత్తన గింజల్లో కలిపిన తర్వాతే పొలంలో విత్తాలి. తద్వారా గింజల్ని తినేసే వేరు తొలుచు పురుగులు దూరంగా వెళ్లిపోతాయి.
- వేరుశనగ పంట సాగులో కలుపు మొక్కల నివారణ మందులు వాడాలి. పొలంలో విత్తనాలు వేసిన రోజు సాయంకాలం లేదా మరుసటి రోజు ఈ రకం మందులు పొలంలో పిచికారి చేయాలి. ఎకరం పొలానికి ఒకటిన్నర లీటరు పెండామిథాలిన్ అనే మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఇలా చేయడం వల్ల విత్తనాలు వేసినప్పటి నుంచి సుమారు రెండు నెలల పాటు కలుపు మొక్కలు పెరగకుండా చూడవచ్చు.
- అంతర్ పంటల వల్ల వేరశనగకు ఎంతో రక్షణగా ఉంటుంది. పొలంలో విత్తనగింజలు వేసే ఆరు సాళ్ల (వరుసలు)కు ఒక సాలు కందులు, అలసందలు వంటి విత్తనాలు వేయాల్సి ఉంటుంది. పొలం చుట్టూ రెండు నుంచి నాలుగు వరసలు జొన్నలు వేయాలి. వీటి వల్ల పక్కపొలాల నుంచి వైరస్, ఇతర క్రిమికీటకాలు, ఎర్రగొంగళి పురుగులు పంటను ఆశించకుండా చేయవచ్చు.

నియోజకవర్గం	వేరుశనగ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
పీలేరు	1089
తంబళ్లపల్లె	1285
మదనపల్లె	986

మెలకువలు పాటిస్తే మంచిది



వేరుశనగ సాగులో రైతులు మెలకువలు పాటించాలి. ముందుగా విత్తన పరీక్షలు చేయించాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలను సకాలంలో పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– రత్నమ్మ, వ్యవసాయాధికారిణి, గుర్రంకొండ

తాగునీటి వద్ద ఘర్షణ

– నలుగురికి గాయాలు



గాయపడ్డ చలపతి

మదనపల్లె : నీటి బోరు వద్ద ఏర్పడిన వివాదంతో జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. మంగళవారం మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ రాయనచెరువు వడ్డిపల్లెలో వలిపి చలపతి కుమార్తెలు లక్ష్మీ, నీలిమలు ఇంటికి సమీపంలోని బోరు వద్ద నీళ్లు పట్టుకుంటుండగా, వరుసకు బాబాయి అయిన బాలకృష్ణ నీరు పట్టవద్దంటూ వారితో గొడవకు దిగి, ఇద్దరిపై చేయి చేసుకున్నాడు. దీంతో వారు తండ్రి చలపతికి జరిగిన విషయం చెప్పడంతో.. చలపతి, భార్య మాధవి, మేనల్లుడు అరుణ్‌కుమార్, చెల్లెలు అరుణతో కలిసి పిల్లలను ఎందుకు కొట్టారని బాలకృష్ణను నిలదీశారు. దీంతో బాలకృష్ణతోపాటుగా రమణమ్మ, ప్రియ, కృష్ణకుమార్‌లు కలిసి చలపతి, కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో చలపతి తీవ్రంగా, భార్య మాధవి ఇతర కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి చేతిలో గాయపడిన బాలుడి మృతి

- కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలు దానం
- కర్నూలు ఆస్పత్రిలో కోలుకుంటున్న కుమార్తె పావని



అభితేజరెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో మతిస్థిమితం కోల్పోయిన తండ్రి నరసింహారెడ్డి గొడ్డలితో నరకడంతో.. తీవ్రంగా గాయపడిన అభితేజరెడ్డి (15) సోమవారం రాత్రి 11 గంటలకు మృతి చెందాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నిద్రపోతున్న అభితేజరెడ్డి, పావనిలపై వారి తండ్రి నరసింహారెడ్డి గొడ్డలితో దాడి చేసి తాను కూడా పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన పిల్లలిద్దరినీ కర్నూలుకు తరలించారు. అయితే అభితేజరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో.. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు బాలుడి తలకు శస్త్రచికిత్స చేశారు. సంఘటన జరిగిన నాటి నుంచి కోమాలో ఉన్న అభితేజరెడ్డి శరీరం తదుపరి చికిత్సకు సహకరించలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని మంగళవారం రాత్రి వారి స్వగ్రామమైన నక్కలదిన్నెకు తీసుకురానున్నారు.

బాలుడి అవయవాలు దానం

అభితేజరెడ్డి అవయవాలను కుటుంబ సభ్యుల అనుమతితో దానం చేశారు. బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు ధ్రువీకరించిన అనంతరం అక్కడి జీవన్‌ధాన్ ట్రస్టు సభ్యులు కిడ్నీలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తులను సేకరించారు. బాలుడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించిన వెంటనే కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేయనున్నట్లు తమ అంగీకారాన్ని తెలిపారు. అక్కడి ఆస్పత్రి అధికారులు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో మాట్లాడారు. ఎస్పీ సూచన మేరకు ప్రొద్దుటూరు రూరల్ ఇన్‌చార్జి సీఐ యుగంధర్ సోమవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్లారు. పోస్టుమార్టం ప్రక్రియ పనులు వేగంగా నిర్వహించి సకాలంలో అవయవాలు సేకరించేలా చొరవ తీసుకున్నారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్, ప్రొద్దుటూరు సీఐ యుగంధర్, సిబ్బందికి ఆస్పత్రి యాజమాన్యం, ట్రస్టు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న పావని

ఇదే సంఘటనలో గాయపడిన పావని కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం పావని కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజుల క్రితం పావని తలకు శస్త్రచికిత్స నిర్వహించారు. చికిత్స అనంతరం పాప మాట్లాడుతున్నట్లు తెలిపారు. తండ్రి, సోదరుడు చనిపోయిన విషయాన్ని పావనికి చెప్పలేదు. స్పృహలోకి వచ్చిన పావని నాన్న, అన్నయ్య ఎలా ఉన్నారు.. వారిని చూడాలంటూ కలవరిస్తోందని కుటుంబ సభ్యులు చెప్పారు. తండ్రితోపాటు సోదరుడు కూడా మృతి చెందిన విషయం తెలిస్తే చిన్నారి గుండె తట్టుకోలేదని బంధువులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఇప్పటికే భర్తను పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉన్న తులశమ్మ.. కుమారుడు కూడా మృతి చెందాడనే విషయం తెలియడంతో విలపించసాగింది. ఆమెను ఓదార్చడానికి బంధువులకు సాధ్యం కాలేదు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

బి.కొత్తకోట : కువైట్‌లో కష్టపడి సంపాదించిన సొమ్మును స్వగ్రామంలో ఉండే భర్తకు పంపిన భార్య.. ఆ డబ్బు గురించి ప్రశ్నిస్తే ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ కె.రామమోహన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం నాయనబావి పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన దేరంగుల సుధాకర్ (38), రత్నమ్మ భార్యాభర్తలు. ఉపాధి కోసం కువైట్ వెళ్లిన రత్నమ్మ అక్కడి నుంచి డబ్బును సుధాకర్‌కు పంపేది. నెలన్నర క్రితం రత్నమ్మ స్వగ్రామం పత్రవారిపల్లెకు వచ్చేసింది. కువైట్ నుంచి పంపిన డబ్బు ఎక్కడని ఆమె భర్త సుధాకర్‌ను అడిగింది. ఆ డబ్బంతా మద్యం తాగేందుకు ఖర్చు చేశానని చెప్పాడు. ఈ నేపథ్యంలో సోమవారం భార్య, కుటుంబీకులను సినిమా చూసేందుకు వెళ్లాలని మదనపల్లెకు పంపి.. సుధాకర్ రాత్రి మద్యంలో విష ద్రావణం కలుపుకొని తాగాడు. మదనపల్లె నుంచి ఇంటికి వచ్చిన భార్య.. భర్త నిద్రపోతున్నాడని భావించి లేపలేదు. మంగళవారం ఉదయం సుధాకర్ గిలగిలా కొట్టుకుంటుంటే చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. విషద్రావణం కలుపుకొని తాగినట్టు గుర్తించారు. ప్రాథమిక వైద్యం అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం 108లో తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మరణించాడు. అంబులెన్స్ సిబ్బంది మృతదేహాన్ని వాల్మీకిపురం ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై మృతుడి తమ్ముడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

రూ.10.5 లక్షలు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో గత నెల 29న జరిగిన చోరీ కేసును తలమంచిపట్నం పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఐదుగురు దొంగలను పట్టుకుని, వారి నుంచి రూ.8.5 లక్షలు, రెండు మోటారు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ నాగరాజు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. మైలవరం మండలం వద్దిరాల గ్రామానికి చెందిన షెట్కరి గురు రవీంద్ర ఇంటిలో గతేడాది డిసెంబరు 29న రూ.12.65 లక్షల నగదు, రెండు బంగారు ఉంగరాలు చోరీకి గురయ్యాయి. బాధితులు తలమంచిపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. వేలిముద్రల ఆధారంగా శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన అనంతమ్మ గారి మహేష్, గురప్ప, సిద్దమ్మ, మంజునాథ్, అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొడాయిపల్లెకు చెందిన రాజకుల్లాయప్ప చోరీ చేసినట్లుగా గుర్తించారు. వీరి నుంచి రూ.8.5 లక్షల నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పగించారు. వీటి మొత్తం విలువ రూ.10.5 లక్షలుగా లెక్కకట్టారు. చోరీ జరిగిన నాలుగు రోజుల్లోనే నిందితులను గుర్తించి, రెండు వారాల్లోనే నగదును రికవరీ చేసిన జమ్మలడుగు రూరల్ సీఐ టి.వి.కొండారెడ్డి, తలమంచిపట్నం ఎస్ఐ గోపినాథ్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు. వారికి నగదు రివార్డు ఇవ్వనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది రియాజ్, శేఖర్, మురళి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి డీ ఫార్మసీ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్ : డీ ఫార్మసీ కోసం దరఖాస్తు చేసి ర్యాంకు పొందిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఇన్ ఫార్మసీ అడ్మిషన్స్ కోసం వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనటానికి ప్రాసెసింగ్ రుసుం ముందుగా ఆన్‌లైన్ ఏపీడిఫార్మా.ఇన్.లో చెల్లించాలని ఆమె పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600ను ఈనెల 18వ తేదీ నుంచి 19వ తేదీలోపు చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థులు ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన రశీదుతోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్లు జిరాక్స్, ఇంటర్, 6వ తరగతి నుంచి 10వ తరగతికి సంబంధించి స్టడీ, క్యాస్టు, ఈడబ్ల్యూఎస్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్ కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 19వ తేదీ నుంచి 20వ తేదీల్లో కౌన్సెలింగ్‌కు రావాలని తెలిపారు. వెబ్ ఆప్షన్ 19వ తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ, పీహెచ్, క్యాప్ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం 19వ తేదీ విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాలని సూచించారు. ఇతర సందేహాలకు హెల్ప్‌లైన్ సెంబర్ మొబైల్ నంబర్ 9618299017కు సంప్రదించాలని వివరించారు.

సంక్రాంతికి రూ.11.77 కోట్ల మద్యం అమ్మకాలు

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా మద్యం విక్రయాలు భారీగా జరిగాయి. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని మద్యం ప్రియులు రూ.11,77,64,760 మద్యాన్ని తాగేశారు. ఇందులో 11,259 లిక్కర్ కేసుల మద్యం విక్రయం ద్వారా రూ.10,67,69,450లు.. 3,922 బీర్ల కేసుల విక్రయాల ద్వారా రూ. 1,09,95,310 ఆదాయం వచ్చిందని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : సిద్దవటంలోని పోలీసుస్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహించామని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు, హెల్మెట్‌లేని వాహనదారులకు సంబంధించి 30 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారికి రూ.4,050 జరిమానా విధించామని వివరించారు. తనిఖీలలో పోలీసులు పాల్గొన్నారు.

గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

పులివెందుల : రోడ్డు ప్రమాదంలో గాయపడిన పులివెందులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వెంకటేశ్వర ఎరుకుల సంఘం అధ్యక్షుడు సాతుపాటి శ్రీనివాసులు(50) మృతి చెందారు. వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం చెర్లోపల్లె గ్రామ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడిని వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందారు.

రైలు కింద పడి యువకుడి..

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివారులోని రిమ్స్ వద్ద రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి చెందాడని రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. అతనికి 25 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉండవచ్చని పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచామన్నారు. మృతుడి సంబంధీకులు కడప రైల్వే పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఆయన వివరించారు.

వ్యక్తి బలవన్మరణం

సిద్దవటం : మండలంలోని డేగనవాండ్లపల్లె గ్రామంలో మాచుపల్లె వెంకటరామిరెడ్డి (70) మంగళవారం బలవన్మరణం చెందాడు. ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం టక్కోలు గ్రామ పంచాయతీ పరిధిలోని డేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన మాచుపల్లె వెంకటరామిరెడ్డి 5 ఎకరాల భూమిలో పంట సాగు కోసం స్థానికుల వద్ద, మాచుపల్లె గ్రామంలో కలిపి రూ.10 లక్షలు అప్పు చేశారు. పంటలు పండక నష్టాలు రావడంతో అప్పు ఎలా తీర్చాలనే దిగులుతో తెల్లవారుజామున తన పొలంలోకి వెళ్లి చెట్టుకు పంచతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి భార్య వెంకటలక్షుమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు కథలు, పద్యపఠన పోటీలు

కడప కల్చరల్ : అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ నిర్వహించనున్న జిల్లా మహాసభ సందర్భంగా ఈ నెల 26న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో విద్యార్థులకు సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నామని సంస్థ జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. పదవ తరగతిలోపు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని, మొత్తం మూడు విభాగాలు ఉంటాయని, ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కథ చెప్పండి విభాగంలో విద్యార్థులు తమకు నచ్చిన కథను ఎంపిక చేసుకుని చూడకుండా చెప్పాల్సి ఉంటుందన్నారు. పౌరాణికం గానీ, జానపదం గానీ, ఆధునిక కథ గానీ చెప్పవచ్చునని, పద్య పఠన పోటీలో విద్యార్థులు ఏవైనా మూడు శతక పద్యాలను చెప్పాల్సి ఉంటుందని వివరించారు. వాటిని వివిధ శతకాల నుంచి ఒకటి, రెండు లేదా అన్నీ పద్యాలు ఎంపిక చేసుకుని చెప్పవచ్చని తెలిపారు. పద్యంతోపాటు భావం కూడా చెప్పాల్సి ఉంటుందని, మూడవ విభాగంలో కవిత్వ రచన పోటీ ఉంటుందని, ఇందులో భాగంగా విద్యార్థులకు ఒక గంట ముందుగా చెప్పాల్సిన కథకు సంబంధించిన అంశాన్ని ఇస్తామన్నారు. విద్యార్థులు స్వయంగా వచన కవిత లేదా పద్యం లేదా గేయ రూపంలో కవిత రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు ధ్రువపత్రాలతోపాటు ఉపయోగకరమైన పుస్తకాలు కూడా బహూకరిస్తామని వివరించారు. విద్యార్థులు తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. పోటీలో పాల్గొనదలిచిన విద్యార్థులు తమ వివరాలను వాట్సాప్ ద్వారా 83282 96952 నంబరుకు పంపాలన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

- నాడు–నేడు పనులను నాణ్యతతో పూర్తి చేయండి
- జేసీ సాయికాంత్‌వర్మ



మాట్లాడుతున్న జేసీ సాయికాంత్‌వర్మ

కడప సిటీ : మన బడి నాడు–నేడు పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సభా భవనంలో మన బడి నాడు–నేడు ఫేజ్–2 పనుల పురోగతిపై విద్యాశాఖ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులు, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనాతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రెండవ దశలో జిల్లాలో 40 శాతానికి పైగా పాఠశాలల్లో మంజూరైన టాయిలెట్లు, ఎలక్ట్రికల్, ప్రహరీగోడలు, అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లు, మేజర్, మైనర్ మరమ్మతులు తదితర ఆరు రకాల అభివృద్ధి పనులను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఫొటో క్యాప్చర్స్ తీసి వారం రోజుల్లోపు పంపాలన్నారు. రూ. 288 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 998 పాఠశాలలు, తొమ్మిది జూనియర్ కాలేజీల్లో చేపడుతున్న పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారి తనిఖీలు చేస్తూ నివేదికలు అందించాలన్నారు. ఫేస్–1లో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాల్లో నిలిచిందని, ప్రస్తుతం ఫేస్–2 పనుల్లో కూడా మొదటి మూడు స్థానాల్లో నిలపాలన్నారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష పీడీ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ దేవరాజు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ కరుణాకర్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.